

ఒక మంచి పదప్రయోగం చేసినా, ఒక మంచి నానుడి వినిపించినా,
మంచి పుస్తకం చేతిలో కనిపించినా మాస్టరుగారు
అభిమానవర్షం కురిపించేవారు

# మరపురాని మా మాస్టారు

**శ్రీ యం. రాజగోపాలరావు**

నలభైయేళ్లకు పైబడి అధ్యాపకునిగా కొనసాగుతున్న నన్ను విద్యార్థిగా ప్రభావితం జేసిన విశిష్ట అధ్యాపకులను స్మరించుకోవటం సహజమనుకొంటాను. నా అధ్యాపకులతోనే సహాధ్యాపకునిగా రెండున్నర దశాబ్దాలు (1958-1984) గడిపే అదృష్టం పట్టిన నేను కొందరిని గురువులుగా, ఆదర్శమూర్తులుగా గ్రహించుకోవటం అనివార్యం. అటువంటి విశిష్ట అధ్యాపకులలో ఒకరు, ఆదర్శ గురువు శ్రీ ఎలవర్తి రోశయ్యగారు.

రోశయ్యగారిని తలచుకోగానే పాతిక సంవత్సరాల సాహచర్యంలో ఆంధ్ర క్రైస్తవ కళాశాల. గుంటూరులో విద్యార్థిగా, సహాధ్యాపకునిగా, పొరుగింటివానిగా, ఎన్నో అనుబంధాలు, అనుభవాలు, అనుభూతులు ముప్పిరిగొంటాయి. మాష్టరుగారిది ఒక విశిష్ట వ్యక్తిత్వం. నచ్చితే వ్యక్తయినా, పుస్తకమయినా, భావమయినా, మాటయినా అనన్యమైన అభిమానం, హద్దులేని ఆదరణ. నచ్చకపోతే తీవ్రనిరసన, తిరస్కారం అదే మాస్టారుగారికి వేలాది అభిమానులను సంపాదించి పెట్టింది. అంతే సంఖ్యలో వ్యతిరేకులనూ సమకూర్చింది.

ఎవరేమన్నా, ఏమనుకున్నా మాస్టారుగారికి పట్టవు. ఆయన ఆలోచనలు, అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలు ఆయన సొంతం. ఇతరులు పొగిడినా తెగిడినా వాటిలో మార్పుండదు. తన అభిమానమయినా వ్యతిరేకతయినా ఎక్కడయినా, ఎప్పుడైనా ఎవరి మధ్యనయినానిర్మొహమాటంగా నిష్కర్షగా కుండబద్దలు కొట్టినట్లు చెప్పటం ఆయన స్వభావం. ఒకటనుకొని, మరొకటిచెప్పి, వేరొటి చేయటం ఆయన వ్యక్తిత్వంలో పొసగదు. అదే వ్యక్తిత్వం ఆయన అధ్యాపనంలో, పరిపాలనలో జాగర్లమూడి కుప్పుస్వామి కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా ఇతరుల సంబంధ బాంధవ్యాలలో ప్రస్ఫుటముగా వ్యక్తమయేది.

రోశయ్య మాష్టరుగారు గొప్ప అధ్యాపకులు. ఆంగ్లాంధ్రభాషల అభిమాని. గ్రాంధికభాష అనుకూలుడు. ఆంధ్రమయినా, ఆంగ్లమయినా, వ్యవహారికంగా ఎన్ని రీతులలో వ్యక్తమయినా, రచనలో ఒక పద్ధతి, వ్యాకరణ నిబద్ధత అవసరమని ఆయన భావించేవారు. వాదించేవారు. మాస్టరుగారి క్లాసుకు హాజరవడమంటే విద్యార్థులకొక సరదా, ఒక ఉత్సాహం, ఒక వేడుక. షేక్స్పియర్ నాటకాలయినా, మిల్టన్ పారడైజ్‌లాస్ట్ అయినా, వర్డ్స్‌వర్త్, కీట్స్ వంటివారి కవితలయినా ఆయా పాత్రలలో లీనమయిపోయి నిశితంగా పదాలను విశ్లేషిస్తూ, అర్థాలను వివరిస్తూ పూసగుచ్చినట్లు అందిస్తూ పాఠం చెబుతుంటే విద్యార్థులలో ఉత్సాహం ఉరకలెత్తేది. ఒక కాల పరిమితి ఉంటుందనీ గంట కొట్టారనీ ఎవరికీ గుర్తుండేది కాదు. అటు తరువాత పీరియడ్ తీసుకోవలసిన అధ్యాపకుడు వచ్చి వాకిటిలో నిలబడితేగాని ఈ లోకంలోకి వచ్చేవారు కాదు. ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఆంగ్ల విభాగంలో మాస్టరుగారిది ఒక విశిష్ట ధోరణి. ఆ ధోరణిలో పునీతమయే అదృష్టం నాలుగు సంవత్సరాలు ఇంటర్మీడియెట్, డిగ్రీ వరించిన వాడిని నేను. అందులో కొంతయినా అందుకోవటానికి కృషి చేసిన వాడిని. ఆ అనుభవం, అనుభూతి, అనిర్వచనీయాలు, అవిస్మృతాలు.

మాస్టరుగారు పాత సైకిల్ మీద కాలేజికి బయలుదేరారంటే ఒకటే హడావిడి. సూటు, బూటు వేసుకొని సైకిల్ మీద సాగడమే ఒక వింత. సాగింది మొదలు ట్రాఫిక్ రూల్స్ తు.చ. తప్పకుండా పాటిస్తూ గంట మోగిస్తూ, మలుపులో చేయి చూపిస్తూ, పాటించని వారిమీద కసరుకొంటూ, అమలు పరచని అధికారులను అభిశంసిస్తూ చెమటలు కక్కుతూ కాలేజిచేరి, హడావిడిగా క్లాసుకు పరిగెత్తుతూ, పుస్తకాల కట్ట సర్దుకుంటూ, వరండాలో కనిపించిన విద్యార్థులను మందలిస్తూ క్లాసుకు వచ్చి ఒక్క ఉదుటున ప్లాట్‌ఫాం (క్లాస్‌రూంలో) ఎక్కి బల్లమీద దుమ్మును హడావిడిగా తుడిచి, దభాలున పుస్తకాలు పడేసి, నల్లబల్ల తుడిచి, క్లాసువైపు తిరిగి చొక్కాలకు గుండీలు పెట్టనివారిచేత పెట్టించిగాని పాఠం ప్రారంభించేవారు కాదు. అచ్చుతప్పులుండని ఫారిన్ ఎడిషన్లంటే మాస్టరుగారికి అభిమానం. కుప్పలుగా తప్పులుండే ఇండియన్ ఎడిషన్లంటే అసహ్యం. ఎవరి దగ్గరయినా ఇండియన్ ఎడిషన్ కనిపిస్తే, ఎక్కడయినా ప్రింటెడ్ నోట్సు కంటబడితే వీరావేశంతో ఊగిపోతూ నిలబెట్టిమరీ తిట్టేవారు. అయినా ఎవరూ బాధపడేవారు కాదు. ఎదురు మాట్లాడేవారు కాదు. అందరూ ఏదో వింత అనుభూతి నాస్వాదించేవారు. మాస్టారుగారి మీద అభిమానం పెంచుకొనేవారు.

ఆంధ్రక్రైస్తవ కళాశాలలో దాదాపు రెండున్నర దశాబ్దాలపాటు అధ్యాపకుడుగా ఉంటూ నా అధ్యాపకుల సాహచర్యం గడిపే అదృష్టం పట్టిన నేను వారితో నిరంతరంగా సరస సల్లాపాలతో గడిపిన అనుభూతి మరపురానిది. మరువలేనిది. కళాశాలలో ఒక అధ్యాపకుల గది. అందులో ఒక ''ముసలివారి మూల'' (oldmen's corner) రోశయ్యగారు, ఎం.జి.థామస్‌గారు, జె.పాల్‌స్‌గారు, కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు, జమ్ముల మడక మాధవరామశర్మగారి లాంటి ఉద్దండుల కేంద్రమది. వారితోపాటుండే ''ముసలి యువకుడి''ని (మిత్రుల పరిభాషలో) నేను. వారి ఆదరమందుతూ (వారి విద్యార్థిగా) అక్కడసాగే ఆంధ్ర, ఆంగ్ల భాషల, పదాల, వ్యాకరణ చర్చలలో

పాలుపంచుకొంటూ ఎన్నో విషయాలను ఆకళించుకొని తరవాతి కాలంలో నా రచనా కార్యక్రమంలో ఎంతగానో వినియోగించుకొన్నాను. ఆ చర్చలు నా రచనా వరవడిని ఎంతగానో ప్రభావితం చేశాయి.

రోశయ్య మాష్టారుతో కూర్చోవటమంటే ఒక రీడింగ్‌రూములో కూర్చునట్లే. రకరకాల పుస్తకాలు, దినపత్రికలు, వారపత్రికలు మాష్టరుగారికి ఇష్టమయినవన్నీ తెస్తుండేవారు. తీరిక సమయంలో వాటిని తిరగేస్తూ నా వంటివారిని మంచి పుస్తకాలు చదవమని మందలిస్తూ చదివిస్తుండేవారు. ఆంగ్ల పదాల స్పెల్లింగ్లు, ఆంధ్ర పదాలలో అరసున్నల వంటి వాటి మీద రసవత్తర చర్చలు సాగుతుండేవి. రోశయ్య మాష్టారు గ్రాంధికవాది. పరవస్తు చిన్నయసూరి వీరాభిమాని. పద స్వరూపాలను భ్రష్టు పట్టించేవారిని ఏవగించుకొనేవారు. వారి పేరును గురించే వారికి గొప్ప సందేహం. తన పేరు యలవర్తి రోశయ్య కావటానికి వీలు లేదని తెలుగులో మొదటి య, వలు ఉండవు కనుక, రోసి+అయ్య కనుక ఎలవర్తి రోసయ్యగా ఉండాలనేవారు. నాకు గుర్తున్నంతలో రోశయ్య మాష్టారు వ్రాసిన పుస్తకాలేమీ లేవు. వారు భీమవరంలో కొంతకాలం ఉద్యోగరీత్యా ఉన్నప్పుడు అక్కడ ఒక కవి జమీందారు గారితో పరిచయమేర్పడి త్రిపురాన సూర్యప్రసాదరావు అనుకొంటాను ఆయన తెనిగించిన మేఘసందేశ అనువాదం ''మొయిలు రాయబారం''కు ఆవుల గోపాలకృష్ణమూర్తి గారితో పాటు రాసిన ఉపోద్ఘాతంలో ''ఎ. రోసయ్య'' అని ముద్రించినట్లుగా గుర్తు. మాష్టరుగారు వ్యాకరణానికి ఎంత ప్రాధాన్యమిచ్చేవారో దీనివల్ల తెల్లతేటమవుతుంది.

మాష్టరుగారితో మసలటమే అనుభవం. ఒక వాక్యం తప్పుగా మాట్లాడినా, రాసినా, ఒక పద స్వరూపాన్ని మార్చివేసినా-నా వ్యాసాలలో-మాష్టరుగారి తిట్లు (దీవెనలు)తప్పేవి కావు. ఒక మంచి పద ప్రయోగం చేసినా, ఒక మంచి నానుడి వినిపించినా, మంచి పుస్తకం చేతిలో కనిపించినా మాష్టరుగారు అభిమాన వర్షం కురిపించేవారు. మాష్టరుగారి చొక్కా జేబులో యాలుక్కాయలు, లవంగాలు ఉండేవి. కోటు జేబులో

స్వీటుస్పండేవి. తనకు నచ్చినప్పుడు భుజం తట్టి ఒక గుద్దు (అభిమానంతో) ఒక స్వీటు విసిరేసి ఒక యాలుక్కాయో, లవంగమో, రెండునో అందించి తన కోసం స్టీలు ఫ్లాస్కులో ప్రత్యేకంగా తెచ్చుకొనే నెస్‌కెఫే కాఫీలో భాగమిచ్చిమరీ సత్కరించేవారు. అటువంటి సత్కారాలెన్నిసార్లు పొందానో చెప్పలేను. మాస్టరుగారితో కలిసి మెలిసి తిరుగుతూ, ఎందరు పెద్దల పరిచయ భాగ్యం పొందానో, పండిత గోపదేవ్‌గారు, ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు, కొండవీటి వేంకటకవిగారు, వట్టికొండ రంగయ్యగారు, నార్ల వెంకటేశ్వరరావుగారు, దరువూరి వీరయ్య గారు ఇంకెందరో, అందరికీ మించి మాస్టరుగారితో కలిసి సాయంత్రంపూట ఇంటికి వచ్చేటప్పుడు రైలు పట్టాలు దాటి (అప్పటికి బ్రిడ్జి ఉండేది కాదు) ఆనంద భవన్ జేరటం, ఆసమయానికి కవికోకిల గుర్రం జాషువాగారు అక్కడికి చేరటం అందరం కలిసి కాఫీ తాగుతూ జాషువాగారి చెణుకుల నాస్వాదిస్తూ ఉల్లాసంగా గడిపిన సందర్భాలెన్నో అన్నీ మధుర స్మృతులుగా మిగిలిపోయాయి.

అద్దింటి వాసంతో విసిగి, సొంతిల్లు మంచిదనే భావం కలిగి వెదికి వెదికి ఒకపెద్ద స్థలం మాట్లాడుకొన్న సందర్భంలో రోశయ్య మాస్టరుగారిని పొరుగున చేర్చుకోవాలనే అభిలాష. దానిని గురించి మాస్టరు గారింట్లో- అప్పుడు అరండల్‌పేట, 6వ లైనులో, డొంక రోడ్‌కు దగ్గరగా ఉండేవారు. చర్చ-నల్లబల్లమీద ప్లానులు-ఎంతకీతెగని నిర్ణయం. అది గమనించి సామ్రాజ్యమ్మగారు ఒకరోజు మాస్టరుగారు లేనప్పుడు - ''మీ మాస్టరుగారంతేనయ్యా - ఏదీతేల్చరు - నువ్వనుకొన్నట్లే ఆ ప్లాటు రాయించు, ఎంతవుతుందో చెప్పు. డబ్బు ఏర్పాటు చేసుకుంటాం'' అన్నారు. ఆ విధంగా స్థలాలు సమకూర్చుకొని ఇళ్ళు కట్టుకొని ఇరుగు పొరుగువారిమయ్యాం. అటు తరువాత నేను ''తెలుగు అకాడమీ'' హైదరాబాద్ చేరటం, మాస్టరుగారు జే.కే.సి. కాలేజిలో చేరటం, మా మధ్య అంతరం పెంచింది. తిరిగి వచ్చిన తరువాత నేను ఆర్.వి.వి.ఎన్. కాలేజి, ధరణికోట చేరటం-దూరం పెంచింది.

ఒక రోజు ప్రొద్దున్నే పేపరులో మాస్టరుగారి ఫోటోతోపాటు వార్త-ది. 23-2-1991 ఉదయం మరణించారని. ఆశ్చర్యపోయి వెంటనే చిన్నయసూరికి ఫోను చేసాను. ఆ రోజు ప్రొద్దున్నేలేచి, పేపరు చదివి, ఇంటికి వచ్చిన ఒక విద్యార్థితో మాట్లాడి, ఇంట్లోకివస్తూ హఠాత్తుగా పడిపోయి అంతలోనే మరణించారు-అనే సమాచారం అందుకొన్ననేను-మాస్టరుగారు ఆఖరులో గూడ ఎవ్వరికి ఎటువంటి ఇబ్బందికలగకుండా ఎటువంటి వ్యాధికిలోనుగాకుండా ఆవిధంగా హఠాత్తుగా మరణించడం-ఆయనను వరించిన అదృష్టంగా, నిష్కల్మష హృదయ తార్కాణంగా భావించి ఆవరించిన విషాదంలోనే ఆనందాశ్రువులు చిందించాను. ''జాతస్య హి ధృవో మృత్యుః'' అందరూ అంతమయి పోవలసిందే-కుడి ఎడమల తేడా- అదే ఆయాచితంగా అకస్మాత్తుగా లభించటం - అదృష్టమే - మీరు అంగీకరిస్తారని విశ్వసిస్తూ......



1988, మనుమడు కిషన్‌తో చికాగోలో